# వరికొయ్యలకు నిప్పంటించొద్దు

- అనాలోచిత చర్యలు వద్దు.. భూమిలో కలియదున్నితేనే మేలు
- పోషకాల పెరుగుదలకు దోహదం..
- సేంద్రియ ఎరువుగా మారే అవకాశం
- భూమికి భూసారమే ఆయువుపట్టు
- వ్యవసాయ అధికారుల సూచనలు

కొల్చారం, డిసెంబర్ 2: సిరులను అందించే భూమికి భూసారమే ఆయువుపట్టు. రైతులు భూమిలో భూసారం కోల్పోకుండా జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలి. వానకాలం వరిపంట కోతలు పూర్తయ్యాయి. ఇప్పుడిప్పుడే యాసంగికి రైతులు సన్నద్ధమౌతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు వరికొయ్యకాలును తగులబెడుతున్నారు. దీంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతున్నదని, విలువైన పోషకాలు భూమి కోల్పోయే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

కొన్నేండ్ల క్రితం వరకు రైతులు కూలీలతో వరిపంటను కొడవళ్లతో మొదళ్ల దాక కోయించేవారు. గడ్డిని పశువులకు పశుగ్రాసం కోసం కుప్పలు, కుప్పలుగా నిల్వ చేసుకునేవారు. క్రమంగా సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. రైతుల దగ్గర పశువుల సంఖ్య తగ్గిపోవడం, కూలీల సమస్యలు ఉత్పన్నం కావడంతో యాంత్రీకరణకు ప్రాధాన్యత ఏర్పడింది. కొల్చారం మండల వ్యాప్తంగా పంచాయతీల్లో ఎక్కువ మొత్తంలో వరిని సాగు చేశారు. యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎక్కువగా వాటినే వినియోగిస్తున్నారు. వరిపంటను యంత్రాలతో కోయించడంతో వరికొయ్యలు పొలంలో పెద్దగా మిగిలిపోతున్నాయి. దీంతో పొలం దున్నే సమయంలో వరికొయ్యలు నాగళ్లకు అడ్డుగా వస్తాయనే ఉద్దేశంతో కొయ్యలను, గడ్డిని సైతం పొలంలోనే నిప్పంటించి కాల్చి వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల భూమిలో విపరీతమైన వేడి పెరిగి భూసారాన్ని కోల్పోయేలా ప్రమాదం ఉందని అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు.


కొల్చారంలో వరికొయ్యకాలు తగులబెట్టిన అన్నదాత

**పంట దిగుబడిపై ప్రభావం..**

ఒక హెక్టారు భూమిలోని వరిపైరు అవశేషాలను తగలబెట్టడం ద్వారా సుమారు రూ.3వేల నుంచి రూ.4 వేల విలువ గల 30 నుంచి 40 కేజీల నత్రజని, 20 నుంచి 30 కేజీల ఫాస్పరస్ , 40 నుంచి 80 కేజీల పొటాషియం, 4 నుంచి 6 కేజీల గంధకం, 1200 నుంచి 1300 వందల కేజీల సేంద్రియ కర్బన పదార్థంతో పాటుగా అనేక సూక్ష్మపోషకాలను భూమిలో నష్టపోవాల్సి వస్తుంది. దీంతో భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు తగ్గుముఖం పట్టడం కారణంగా రైతులకు పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు.

**పొలంలో కలియదున్నాలి...**

వరికొయ్యలను పొలంలో కలియదున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. దున్నే ముందు సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే రెండు వారాల్లో వరికొయ్యలు, గడ్డి మొక్కలు మురిగి కుళ్లిపోతాయి. దీంతో ఎరువుగా తయారవడంతో పోషకాలు పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది. నేలలో వరి కొయ్యలను కలియదున్నడంతో ఎకరానికి దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది. దీంతో మొక్కలను 2 శాతం నత్రజని, 4 శాతం ఫాస్పరస్ అదనంగా అందిస్తుంది. సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

### అధికారుల సూచనలు పాటించాలి



యాసంగి సీజన్‌కు వ్యవసాయ పనులు ప్రారంభంకానున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి. వరికొయ్యలకు నిప్పంటించే అనాలోచిత చర్యలు వద్దని, భూమిలో కలియదున్నితేనే మేలు. ముందుగా నీళ్ల వేసి ట్రాక్టర్‌తోగాని, ఎద్దుల నాగలితో కాని దమ్ము చేసుకుని పొలంలో ఉన్న గడ్డి, చెత్తాచెదారం కుళ్లిపోయేలా చూసుకోవాలి. దాంతో భూములు సారవంతంగా అవుతాయి.

– శ్వేతకుమారి, వ్యవసాయాధికారి, కొల్చారం


ధనుర్మాసం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ కంచి

## 17 నుంచి ధనుర్మాసం ప్రారంభం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 2: ఈనెల 17వ తేదీ నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుండడంతో శనివారం సంబంధిత కరపత్రాన్ని వెంకటేశ్వర దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కంచి మధుసూదన్ ఆవిష్కరించారు. జనవరి 14 వరకు ధనుర్మాస మహోత్సవాలు నిర్వహిస్తారని, 23న ఉదయం 4 గంటలకు ముక్కోటి వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయం ప్రధాన అర్చకుడు నాగేంద్రచారి, ఆలయ కమిటీ సభ్యుడు వెంకన్న, వ్యాపారవేత్త ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

## మెదక్ పట్టణంలో 79.82 శాతం పోలింగ్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 2: గత నెల 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పట్టణంలో 79.82 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.గతఎన్నికల కంటే ఈసారి 1.35 శాతం పోలింగ్ పెరిగిందన్నారు. పట్టణంలో 30,562 ఓటర్లు ఉండగా 24, 395 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలో 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 163 పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 88.21శాతం నమోదు కాగా, అత్యల్పంగా 153 పోలింగ్ కేంద్రంలో 63.76 శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అధ్యాపకులు

## బీవీఆర్ఐటీలో నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే

నర్సాపూర్, డిసెంబర్2: నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ ఐటీ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే'ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ సలాజి ఎస్.వి. సుబ్బారావు హాజరయ్యారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలోని వివిధ సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా.సంజయ్‌దూబే, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.కృష్ణరావు, మేనేజర్ బాపిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శబరికి పాదయాత్రగా అయ్యప్పలు

పెద్దశంకరంపేట, డిసెంబర్2: కేరళలోని శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధానానికి శనివారం పెద్దశంకరంపేట నుంచి అయ్యప్ప స్వాములు తరలివెళ్లారు. బాన్సువాడకు చెందిన వినయ్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో పెద్దశంకరంపేట, బాన్సువాడ,ఎల్లారెడ్డి, జుకల్, నారాయణఖేడ్‌కు చెందిన అయ్యప్ప స్వాములు పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పెద్ద శంకరంపేటకు చెందిన సీనియర్ గురుస్వామి రామచంద్రాచారి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు వారికి స్వాగతం పలికి అన్నదానం ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణా సుభాష్‌గౌడ్, గురుస్వాములు రామ్మూర్తి, రాములు, సాయిరాం, పరంధాం, తదితరులు ఉన్నారు.


పెద్దశంకరంపేట: శబరిమలైకి పాదయాత్రగా తరలుతున్న అయ్యప్ప స్వాములు

## చెరువులోపడి యువకుడి మృతి

అల్లాదుర్గ్, డిసెంబర్ 2: మండలంలోని అప్పాజిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు శనివారం చెరువులో పడి మృతి చెందాడు. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం అప్పాజిపల్లికి చెందిన కుర్మ శ్రీహరి(25)గత నెల 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు పలువురు గ్రామస్తులకు పోలింగ్ కేంద్రం వద్ద కనిపించాడని, అదే రోజు సాయంత్రం శ్రీహరి అదృశ్యమయ్యాడని తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టు పక్కల గాలించిన ఆచూకీ లభించలేదు. కాగా శనివారం ఉదయం గ్రామ సమీపంలోని గండి చెరువులో శ్రీహరి మృతదేహం కనబడింది. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి పెద్దనాన్న కుర్మ నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.


కుర్మ శ్రీహరి (ఫైల్)

## శిలాన్యాసానికి ఆహ్వాన పత్రిక అందజేత

శివ్వంపేట, డిసెంబర్ 2: శివ్వంపేట మండలం గూడూరులో నిర్మించే శ్రీగురుపీఠం దేవాలయానికి 7వ తేదీన శిలాన్యాసం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని షిరిడీసాయి మందిరం తో పాటు షిరిడీలో ఉన్న దేవాలయాల అన్నింటికీ బంగారు గోపురాన్ని అమర్చిన షిరిడీసాయి భక్తుడు విజయ్‌కుమార్, వనజాచౌదరి దంపతులకు శనివారం శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్ ఆహ్వాన పత్రిక అందజేశారు.


విజయ్‌కుమార్ దంపతులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శివకుమార్‌గౌడ్

## నిరుపేద పెండ్లికి పుస్తెమెట్టెలు అందజేత

శివ్వంపేట, డిసెంబర్ 2 : మండలంలోని చండి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మియ్యాడి ప్రవళిక వివాహానికి శనివారం పిల్లుట్లకు చెందిన బీఆర్ఎస్ మండల కోశాధికారి బండారి గంగాధర్ సొంత ఖర్చులతో పుస్తె మెట్టెలను అందజేశారు.ఆయన వెంట చండి యువసేన అధ్యక్షుడు కుమ్మరి సురేష్ ఉన్నారు.


పుస్తెమెట్టెలు అందజేస్తున్న గంగాధర్

# ఆన్‌జాబ్ శిక్షణతో ఉజ్వల భవిష్యత్

- విద్యార్థులు శ్రద్ధగా శిక్షణను అలవర్చుకోవాలి
- జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ

రామాయంపేట, డిసెంబర్ 2: విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేస్తే ప్రభుత్వమే ప్లేస్‌మెంట్ కల్పిస్తుందని ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ట్రైనింగ్ విద్యార్థులకు పలు విభాగాలలో శిక్షణ జరుగుతుంది. ఈ శిక్షణను బ్యాంకు, వైండింగ్ వర్క్స్ తదితర వాటి వద్ద శిక్షణ చేస్తున్న విద్యార్థుల వద్దకు శనివారం అధికారి సత్యనారాయణ వెళ్లి వారి చేసే పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకేషనల్ ట్రైనింగ్ వల్ల మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఒకేషనల్ ట్రైనింగ్ చేసే సబ్జెక్టుపై ప్రత్యేకంగా దృష్టి పెడితే విజయం సాధిస్తారని, ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు ప్రాక్టికల్‌లో ఏ మాత్రం అశ్రద్ధ వహించినా భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల డాటా ఎంట్రీని పరిశీలించారు. అధికారి వెంట రామాయంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, మల్లేశం, బాబు రావు, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.


కంప్యూటర్ శిక్షణను తిలకిస్తున్న నోడల్ అధికారి సత్యనారాయణ


బ్యాంకులో విద్యార్థుల పనితీరును పరిశీలిస్తున్న నోడల్ అధికారి సత్యనారాయణ